క్లుప్తంగా

శంకర నేత్రాలయానికి వృద్ధులు


బస్సును ప్రారంభిస్తున్న వైద్యాధికారి రాజేష్

తాళ్లూరు: కంటి ఆపరేషన్‌లు అవసరమైన వృద్ధులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి శుక్రవారం పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు తరలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ శంకర కంటి వైద్యశాల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తాళ్లూరు నుంచి ఏడుగురు, ముండ్లమూరు నుంచి 18 మంది, అద్దంకి నుంచి 25 మందిని ఆపరేషన్‌కు తరలిస్తున్నట్లు పీఎండీఓ ఉమ తెలిపారు. ఆశ కార్యకర్తలు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


క్రీడా జ్యోతితో ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగుభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ సావిత్రి, ప్రధానోపాధ్యాయురాలు శ్యామ్‌ప్రసన్నతాంజలి, పీడీలు పి.రామానాయక్, రామానాయక్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈలో చోరీ


విద్యుత్ తీగ చోరీ జరిగిన ప్రాంతం..

దర్శి: మండలంలోని నడింపల్లి సమీప ఎంఎస్ఎంఈ పార్కులో 7 కిలోమీటర్ల కండక్టర్ వైర్లు కట్ చేసి దొంగలు దోచుకెళ్లారు. ఏఈ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. చోరీ సొత్తు సుమారు రూ.4.50 లక్షలు ఉంటుంది. ఐదుగురు కలిసి దొంగతనం చేయగా ముగ్గురు దొరికారని, మరో ఇద్దరు దొరకాల్సి ఉందని ఏఈ చెప్పారు. ఎంఎస్ఎంఈ పార్కులో ఇంత పెద్ద స్థాయి దొంగతనం జరగడంతో విద్యుత్ అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రూరల్ ఏఈ వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ముండ్లమూరు (దర్శి): ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండలంలోని పసుపుగల్లు శ్రీసాయి శ్రీనివాస ట్రేడర్స్, వ్యవసాయ సొసైటీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి తిరుమలరావులు మాట్లాడుతూ డీలర్లు తమ వద్ద ఉన్న స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో ఎంటర్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు ఇవ్వాలని, ఈ–పాస్ యంత్రంలో ఉన్న స్టాకు భౌతికంగా ఉన్న స్టాకు సమానంగా ఉండాలని ఆదేశించారు. ఎరువుల కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మినా డీలర్లపై ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటోవాలాల జీవనాధారానికి బ్రేకులు



బస్సులో వేలాడుతూ ప్రయాణిస్తున్న ప్రయాణికులు


తూర్పుగంగవరం ఆటో స్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

- మహిళలకు ఉచిత బస్సుతో అవస్థలు
- బాడుగలు లేక ఆర్థిక ఇబ్బందులు
- ప్రభుత్వంపై ఆటో డ్రైవర్ల ఆగ్రహం

తాళ్లూరు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర దాటింది. ఎన్నికల హామీలను అమలు చేస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. అందులో సూపర్ సిక్స్ మేనిఫెస్టో చాలా కీలకమైంది. ఆ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో పాలకులు విఫలమవుతూనే ఉన్నారు. రెండు మూడు పథకాలు అమలు చేసినా అర్హుల సంఖ్య అంతంత మాత్రమే. పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదన్న భావనలో ప్రజలు ఇప్పటికే వచ్చేశారు. అమలు చేసిన పథకాలకు సంబంధించి ఏవో సాకులు చూపి కొందరిని అనర్హులుగా ప్రకటిస్తున్నారు.

ఆ పథకంతో ఆటో డ్రైవర్లకు కష్టాలు

సూపర్ సిక్స్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీన స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంతో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆటోడ్రైవర్లకు పూర్తిగా జీవనోపాధి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఉన్నత చదువులు చదువుకున్నా ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో వారు ఆటో రంగాన్ని ఎంచుకున్నారు. కానీ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసి ఆటో డ్రైవర్లకు ఉపాధిపై దెబ్బ కొట్టింది. ఆటో డ్రైవర్లతో పాటు వారి కుటుంబ సభ్యులు తమకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాన్ని చూపాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మండలంలోని తూర్పుగంగవరం ప్రధాన కేంద్రంగా ఆటో స్టాండ్ ఉంది. అందులో దాదాపు 100 ఆటోలు ఉన్నాయి. తూర్పుగంగవరం నుంచి దర్శి, చీమకుర్తి, తాళ్లూరు, నాగంబొట్లపాలెం ప్రధాన మార్గాన ప్రయాణించే ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తూ రోజుకు ఒక్కో డ్రైవర్ 700 నుంచి 800 రూపాయలు సంపాదించుకునే వారు. ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయడంతో ఆటోలు స్టాండ్‌లోనే ఉంటున్నాయి. ప్రయాణికుల కోసం గంటల తరబడి చూస్తున్నా ఉపయోగం లేకుండా పోతోంది.

ఫైనాన్స్‌లో ఆటోల కొనుగోలుతో కష్టాలు

కొందరు డ్రైవర్లు లక్షల రూపాయలు వెచ్చించి ఫైనాన్స్‌లో ఆటోలు కొనుగోలు చేశారు. ప్రతి నెలా వేల రూపాయలు ఈఎంఐలు కట్టాల్సి ఉంది. కొందరు ఆటో డ్రైవర్లు అద్దె ఇళ్లల్లో ఉంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పిల్లల ఫీజులు, పెరిగిన డీజిల్, గ్యాస్ ధరల రీత్యా కుటుంబ పోషణ కష్టంగా ఉంటుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేసిన రోజే ఆటో డ్రైవర్లకు ఏటా 15 వేల రూపాయలు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ ప్రస్తావన తీసుకురాలేదు. ఆటో డ్రైవర్లకు వెంటనే 15 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు ఆటో డ్రైవర్లకు సంక్షేమ పథకాల మాటే ఎత్తలేదు. తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామన్న హామీని పాలకులు మర్చిపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని పలువురు ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది



ఐదు సంవత్సరాల నుంచి ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించింది. ఫలితంగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారు. రోజూ ఉదయం నుంచే ప్రయాణికుల కోసం ఎదురుచూస్తున్నా ఒక్క మహిళ కూడా ఆటో ఎక్కడం లేదు. అంతక ముందు రోజుకు రూ.800 వరకు సంపాదించేవాడిని. ఉచిత బస్సు పథకంతో మాకు కష్టాలు వచ్చాయి. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపాలి.

– ఎన్.ఏడుకొండలు, శివరాంపురం, ఆటోడ్రైవర్

ఉచిత బస్సుతో తీవ్ర నష్టం



సహజంగా ఆటోల్లో మహిళలే ఎక్కువ మంది ప్రయాణిస్తుంటారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఆదాయం తగ్గి తీవ్ర నష్టం జరుగుతోంది. గత ప్రభుత్వంలో ప్రతి ఏటా పది వేల రూపాయలు ఆటో డ్రైవర్లకు అందించారు. ఈ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 15 వేల రూపాయల ఆర్థిక సాయం చేస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

– అంబటి సుబ్బారెడ్డి, తూర్పుగంగవరం, ఆటోడ్రైవర్


త్రిపురసుందరీపురంలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి


కొత్తపల్లిలో..

దర్శి: హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని టీఎస్ పురం, కొత్తపల్లి, జముకులదిన్నె గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీ ఇచ్చిన హామీలు గుర్తు చేస్తూ ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నిసార్లు అధికారంలోకి వచ్చినా ప్రజలను మోసం చేయడం తప్ప చెప్పుకోవడానికి చేసిందేమీ లేదన్నారు. 143 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసగించారన్నారు. వికలాంగులు, వృద్ధులకు పింఛన్‌లు పెంచుతామని చెప్పి ఉన్న పింఛన్‌లు తీసేస్తున్నారన్నారు. ఒక్క దర్శి మండలంలోనే 500పైగా పింఛన్‌లు తీసి వేయడం దారుణంగా ఉందన్నారు. పేదల నోట్ల కొట్టడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మండిపడ్డారు. ఇక్కడ గొప్పలు చెప్పుకునే నాయకులు తీసేసిన పింఛన్‌లకు ఏం సమాధానం చెప్తారని సూటిగా ప్రశ్నించారు. నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నిలువునా మోసగించారన్నారు. మహిళలకు రూ.1500 నెలకు ఇస్తామని వారినీ మోసం చేశారన్నారు. గతంలో ఏ ఊరికి రోడ్డు ఉందో ఆ ఊరికి బస్సు ఉంటుందని చెప్పిన చంద్రబాబు ఒక్క సర్వీసును కూడా గ్రామీణ ప్రాంతలకు ఏర్పాటు చేయక పోవడం దారుణంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యూరియా కొరత ఉంటే ఆ కొరతను అధికారులు కవర్ చేస్తున్నారని, ఏ గ్రామంలో చూసినా రైతులు యూరియా బ్లాక్ మార్కెట్‌లో తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గ్రామాల్లోనే ఎరువులు అందజేస్తే చంద్రబాబు అధికారంలోకి వచ్చి వాటిని రైతు సేవా కేంద్రాలుగా పేర్లు మార్చి కనీసం ఆ సేవలు కూడా అందించడం లేదని ఎద్దేవా చేశారు. రైతులందరికీ మేలు జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. పార్టీ రాష్ట్ర మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కౌన్సిలర్ తుళ్లూరి బాబూరావు, ఇరుగుల శ్రీనివాసరెడ్డి, షేక్ అమీన్‌బాషా, అన్నవరపు రవి, సర్పంచ్ రామారావు, ఎంపీటీసీ ఇల్లూరి సుబ్బారెడ్డి, బాలిరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు రాచపూడి యోహాన్, వేమిరెడ్డి వెంకట నరసారెడ్డి, సంగన నాగిరెడ్డి, పులి విష్ణు, రోశిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

మిరపనాట్లతో రైతన్నల బిజీ బిజీ


పుల్లలచెరువులో మిరప మొక్కలు నాటుతున్న కూలీలు

పుల్లలచెరువు: వ్యవసాయ పనులు పలు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల అల్ప పీడన ప్రభావంతో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో బోరు బావులు, చెర్వుల్లో నీరు నిల్వ చేరింది. దీంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మిరప పంటను అధికంగా సాగు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చెర్వులకు నీరు రావడంతో వాటి కింద వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే గ్రామాల్లో అనేక వ్యాపార పంటలను సాగు చేస్తున్నారు. మిర్చి సాగుకు అదును రావడంతో రైతులు ఆ పంటపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం పడిన వర్షాలకు అదును దాటిపోతోందని, మళ్లీ వర్షాలు పడతాయని ఆశతో రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

స్వచ్ఛత, మాధుర్యమే తెలుగుభాష


గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్ వాణి

పుల్లలచెరువు: పాలలో ఉన్న స్వచ్ఛత, తేనెలో ఉన్న మాధుర్యం కలగలిపిన పదజాలమే తెలుగుభాష..అని స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్ వాణి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో గిడుగు రామూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి రామ్మూర్తి పంతులు ఎనలేని కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగు మట్లాడటంతో పాటు పిల్లలకు తెలుగు గొప్పతనాన్ని తెలియజేయాలని చెప్పారు.

అమరులకు నివాళి


అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

త్రిపురాంతకం: విద్యుత్ సమస్యలు తీర్చాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కామ్యూనిస్టు పార్టీలు ఉద్యమించగా ఆనాడు అధిరారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కాల్పులు జరిపిందని నాయకులు రఘురామ్, శ్రీనివాస్ గుర్తు చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యమాన్ని గుర్తుచేస్తూ అమరులకు నివాళులర్పించారు. విద్యుత్ ఉద్యమం సందర్భంగా ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం లాఠీ చార్జి, బాష్పవాయువు, కాల్పులు జరిపిందన్నారు. ఆనాడు కాల్పుల్లో బాలకృష్ణ, వెంకటస్వామి, విష్ణువర్ధన్ మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం ఇదే పోకడలు పోతోందని పేర్కొన్నారు. మల్లికార్జున్, రామయ్య, కాశీం, ఆంజనేయులు, పవన్‌కుమార్, రాజరామయ్య, నాగమల్లేశ్వరి, నాగేశ్వరరావు, రవి చంద్ర పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లురెడ్డి సేవలు వెలకట్టలేనివి


మాట్లాడుతున్న డీఐఈఓ ఆంజనేయులు

తాళ్లూరు: స్థానిక జూనియర్ కళాశాలకు బొద్దు వెంకటేశ్వర్లురెడ్డి అందించిన సేవలు వెలకట్ట లేనివని డీఐఈఓ కె.ఆంజనేయులు అన్నారు. స్థానిక వీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగేళ్లుగా రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయనకు శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యక్షంగా, పరోక్షంగా కళాశాల అభివృద్ధికి ఆయన ఎంతగానో దోహదపడ్డారని ఆంజనేయులు కొనియాడారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


గృహనిర్మాలను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

తాళ్లూరు: ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మండల స్పెషలాఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి సమయపాలన పాటించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి స్వామిత్ర సర్వే చేస్తున్న అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఎస్.సత్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు


మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న డాక్టర్ జగదీష్

పెద్దారవీడు: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బద్వీడు పంచాయతీ చెంచుగూడెంలో డాక్టర్ జగదీష్ నేతృత్వంలో బాలింతలు, గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. ప్రభుత్వ గిరిజన పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకొని సకాలంలో టీకాలు వేయించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది టీకాలు వేస్తున్నారా లేదా అని వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వచ్చే సీజనల్ వ్యాధులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ముందు నీరు ఎప్పటికప్పుడు నిల్వ లేకుండా పారే విధంగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వర్షంలో తడిసిన వెంటనే తడి బట్టలను తీసేయాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు అలీసమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

పెద్దమంతనాలలో వైద్య శిబిరం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పెద్దమంతనాల గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కొర్రప్రోలు వైద్యాధికారులు విజయ్ కుమార్, లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో జ్వరాలు, దగ్గు, జలుబుతో బాధపడుతున్న గిరిజనులకు చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేష్, 108 ఈఎంటీ జనార్దన్, ఏఎన్ఎం మూగెమ్మ, ఆశ కార్యకర్త వెంకటమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వినాయకునికి వీడ్కోలు

పెద్దారవీడు: మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజులు వినాయక స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం వినాయకుని విగ్రహం ట్రాక్టర్‌పై పెట్టుకొని గ్రామంలోని పూరవీధుల్లో ఊరేగింపు కోలాహలంగా సాగింది. వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఊరేగింపులో మహిళలు, యువకులు తరలివచ్చి ఆటపాటలతో సందడి చేస్తూ ముందుకు సాగారు. స్వామి వారు ఇంటి ముందుకు రాగానే నీటి బిందెతో వారుపోసి కాయకర్పూరం సమర్పించారు. భక్తులకు పులిహార, నైవేద్యం పంచి పెట్టారు.


ముండ్లమూరు: లడ్డూకు వేలం నిర్వహిస్తున్న భక్తులు

ముండ్లమూరు (దర్శి): మండలంలో గణేష్ నిమజ్జనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోలవరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. గులాంలు చల్లుకుంటూ ఉత్సాహంగా వినాయక నిమజ్జనం చేశారు. వేలం పాటలో రూ.15 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

దొనకొండ (కురిచేడు): స్థానిక బాలాజీ పెట్రోల్ బంక్‌ను తహసీల్దార్ డి.రమాదేవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. కొలతల్లో తేడాలు గమనించి రికార్డులు పరిశీలించి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. వీరి వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ

పెద్దదోర్నాల: ఎన్‌ఫోర్స్‌మెంట్ డే సందర్భంగా తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శేఖర్‌లు మండల కేంద్రంలోని పలు రేషన్ షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని రేషన్ దుకాణాలతో పాటు గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంక్‌ల్లో కూడా తనిఖీలు చేపట్టారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు


సామాజిక ఆరోగ్య కేంద్రంలో జ్వరాలతో బాధపడుతున్న రోగులు

పెద్దదోర్నాల:

మండల వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వాతావరణంలో మార్పులతో డయేరియా, టైఫాయిడ్, సీజనల్ జ్వరాలతో పాటు డయేరియా కేసులతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. 15 రోజులుగా నల్లమల అభయారణ్యంతో పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పారిశుధ్యం పేరుకు పోవడంతో సీజనల్ వాధ్యులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, సీజనల్ జ్వరాలతో పాటు అక్కడక్కడా డయేరియా పెరిగి వైద్యశాలలు రోగులతో నిండిపోతున్నాయి. రోజూ వందల సంఖ్యలో రోగులు చికిత్స పొందుతున్నారు. గతంలో కంటే రోగుల సంఖ్య పెరిగిందని వైద్యశాల సిబ్బంది పేర్కొంటున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లల వైద్యులు లేకపోవటంతో తల్లిదండ్రులు ప్రైవేటు వైద్యశాలల వైపే మొగ్గు చూపుతున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, అనస్థీషియా, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ, యూడీసీ, జూనియర్ అసిస్టెంట్ తదితర విభాగాలన్నీ ఖాళీగా ఉండటంతో పాటు మరి కొందరు డాక్టర్లు పలు కారణాలతో సెలవులపై వెళ్లారు. ప్రస్తుతానికి వైద్యశాలలో సాధారణ సేవలు మాత్రమే అందుతున్నాయిని పలువురు పేర్కొంటున్నారు.

వైద్యుల కొరత త్వరలో తీరనుంది

సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత త్వరలోనే తీరనుంది. వివిధ ప్రాంతాల నుంచి ట్రాన్స్‌ఫర్‌లపై వైద్యులు వచ్చే అవకాశం ఉంది. టైఫాయిడ్, సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాకాలం నేపథ్యంలో కొత్త నీరు చేరటంతో వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఫలితంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగుపడాలి. సురక్షిత నీరు తాగాలి.

– నాగమహేశ్వరి, సూపరింటెండెంట్

సాంబశివరావు కృషి మరువలేనిది

యర్రగొండపాలెం: విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు బుర్రా సాంబశివరావు చేసిన కృషి మరువలేనిదని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. మండలంలోని గంగాపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వర్తించిన ఆయన పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఎంఈవో మాట్లాడుతూ బుర్రా పనిచేసిన పాఠశాలల్లో తోటి ఉపాధ్యాయులతో మంచిగా మెలిగేవారని, విద్యార్థులతో సఖ్యతగా ఉంటూ వారికి విద్యను బోధించేవారన్నారు. సాంబశివరావు దంపతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎంఈవో–2 మల్లూనాయక్, కాంప్లెక్స్ చైర్మన్ హెమలా నాయక్, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు చలమయ్య, స్థలదాత వెంకటేశ్వర్లు, ఆడిటర్ వెంకట్, ఆనంద్, సాంబశివారావు పాల్గొన్నారు.


బుర్రా దంపతులను సన్మానిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు